# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 2 | సంచిక: 242 | పేజీలు: 4 | వెల: రూ.3/- | ఆదివారం 8 డిసెంబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్


# కేసీఆర్ ఏనాడైనా ప్రతిపక్ష పాత్రను పోషించారా?

- గెలిస్తే ఉప్పొంగడం... ఓడితే కుంగిపోవడమా కేసీఆర్?
- కేసీఆర్ స్థాయికి కుంగిపోవడం తగదు
- ఓడిపోగానే ఫాంహౌస్‌కు వెళ్లిపోయారు
- కేసీఆర్ గాలి బ్యాచ్‌ను తమ పైకి వదిలి వెళ్లారు
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి
- నల్గొండలో కాంగ్రెస్ విజయోత్సవ సభ నిర్వహణ
- మీరు దొంగల బండి ఎక్కితే మీపై ఉన్న గౌరవం పోతది
- కిషన్ రెడ్డి, ఈటలకు సూచన
- బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

**నల్గొండ, డిసెంబర్ 7 (ప్రభాత ఉదయం):** ఈ ఏడాది కాలంలో కేసీఆర్ ఏనాడైనా ప్రతిపక్ష నేతగా తన పాత్రను పోషించారా? బీఆర్ఎస్ హయాంలో తమ ఎమ్మెల్యేలను లాక్కుంటే వెనుకడుగు వేయకుండా పోరాడామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గెలిస్తే ఉప్పొంగిపోవడం... ఓడితే కుంగిపోవడం కేసీఆర్ స్థాయికి తగదన్నారు. తాను గతంలో ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ ప్రజల్లోనే ఉండి ఎంపీగా గెలిచానన్నారు. కానీ కేసీఆర్ ఒక్కసారి ఓడిపోతే కుంగిపోయి ఫాంహౌస్‌లోకి వెళ్లారని ఎద్దేవా చేశారు. నల్గొండలో నిర్వహించిన కాంగ్రెస్ విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ గాలి బ్యాచ్‌ను తమ పైకి వదిలి వెళ్లారని మండిపడ్డారు. ప్రభుత్వం ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా వద్దంటున్నారని, అలా చేస్తే తెలంగాణ ముందుకు ఎలా వెళుతుందని ప్రశ్నించారు. సంక్రాంతి తర్వాత రైతు భరోసా నిధులు వేస్తామని... రైతుల ఖాతాల్లో డబ్బులు పడుతుంటే బీఆర్ఎస్ నేతల గుండెలు లబ్‌డబ్ అంటూ కొట్టుకోవాలన్నారు. రైతులు సన్నాలు పండించాలని విజ్ఞప్తి చేశారు. ఎయిర్ పోర్టుకు కూతవేటు దూరంలో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. మూసీ ప్రక్షాళన చేస్తానంటే బీఆర్ఎస్ నాయకులు వద్దంటున్నారని, కానీ అనుభవం కలిగిన కేసీఆర్ ఈ అంశంపై తన వైఖరిని చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రక్షాళన వద్దంటే బొంద పెడతారని హెచ్చరించారు. బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్‌కు తాను ఒక్కటే మాట చెబుతున్నానని, మీరు మారాలని, ఆలోచన చేయాలని ..మిగతా 2లో



### మేమిచ్చినన్ని ఉద్యోగాలు
# మీరిచ్చారా?

**నిరూపిస్తే...ఢిల్లీలో నడి బజారులో క్షమాపణలు చెబుతా**
**బిజెపి అధ్యక్షుడు నడ్డాకు ఇఎం రేవంత్ సవాల్**



**నల్లగొండ, డిసెంబర్ 7 (ప్రభాత ఉదయం):** దేశంలోనే మొదటి ఏడాదిలో 55వేల 143 ఉద్యోగాలు ఇచ్చింది ఒక్క తెలంగాణలోనేనని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నల్గొండ కాంగ్రెస్ విజయోత్సవ సభలో సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోడీకి సవాల్ విసిరారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో తాము ఇచ్చిన ఉద్యోగాలు ఎక్కడైనా ఇస్తే.. ఢిల్లీ నడిబజార్ లో వచ్చి క్షమాపణ చెబుతానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలోనే మా అడ్డాకు వచ్చి అడ్డగోలుగా మాట్లాడొద్దని కేంద్ర మంత్రి నడ్డాను హెచ్చరించారు. ఎడాదిలో 21కోట్లతో రెండు లక్షల రుణమాఫీ చేసిన చరిత్ర మా కాంగ్రెస్ పార్టీదని అన్నారు. ఒక్క నల్గొండ జిల్లాలోనే 2004 కోట్ల రుణమాఫీ జరిగిందని.. ఉచిత కరెంట్ పేటెంట్ కాంగ్రెస్ పార్టీదేనని చెప్పుకొచ్చారు. 24గంటల కరెంట్ ఇచ్చి 50లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు తెలిపారు. రోజు 18గంటలు పనిచేస్తున్నామని.. అయితే, సోషల్ మీడియాలో ..మిగతా 2లో

# ఇకపై అత్యంత చౌకగా ఇంటర్నెట్ సేవలు

**టి ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్**
**సన్నాహాలు చేస్తున్న తెలంగాణ ప్రభుత్వం**

**హైదరాబాద్, డిసెంబర్ 7 (ప్రభాత ఉదయం):** ఇకపై తెలంగాణలో అత్యంత చౌకగా ఇంటర్నెట్ సేవలు లభించనున్నాయి. టి ఫైబర్ ద్వారా ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది. ఈ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి ఇంటర్నెట్ కనెక్షన్‌ను ప్రభుత్వం 300 రూపాయలకే ఇవ్వనుంది. ఈ కనెక్షన్ ద్వారా ప్రతి ఇంట్లో ఉన్న టీవీని కంప్యూటర్ మాదిరిగా వినియోగించుకోవచ్చు. దీని ద్వారా టీవీలోనే ప్రత్యేక వెసులబాటును కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. 20 ఎంబిబిఎస్ స్పీడ్‌తో ఇంటర్నెట్ కనెక్షన్ అందివ్వనుంది ప్రభుత్వం. ఇందులో పలు తెలుగు ఓటీటీలు కూడా అందుబాటులో ఉంటాయి. మొదటి దశలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 2096 కి పైగా గ్రామపంచాయతీలో ఈ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు.



వీటితోపాటు 30 వేలకు పైగా ప్రభుత్వ సంస్థలను అనుసంధానించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు టీ ఫైబర్ సంస్థ ప్రతినిధి వెల్లడించారు. తొలి దశలో తెలంగాణలోని పలు జిల్లాలలో టీ ఫైబర్ ట్రయల్ సేవలను ప్రారంభించనుంది. సీఎం రేవంత్ రెడ్డి మీదగా టీ ఫైబర్ ట్రైల్ ..మిగతా 2లో

# ప్రజాపాలన దినోత్సవాలు

**9న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ**
**కెసిఆర్‌ను ఆహ్వానించిన మంత్రి పొన్నం**



**హైదరాబాద్, డిసెంబర్ 7 (ప్రభాత ఉదయం):** తెలంగాణ రాష్ట్రంలో ఆసక్తికర పరిణామం చోటు చేసుకుంది. ఈనెల 9న సచివాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి మాజీ సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం అందింది. బీఆర్ఎస్ అధినేత ..మిగతా 2లో

# తెలంగాణలో మార్పు భాజపాతోనే సాధ్యం

**ఎన్నికలు ఎక్కడ జరిగినా భాజపా.. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా**

**హైదరాబాద్, డిసెంబర్ 7 (ప్రభాత ఉదయం):** తెలంగాణలో మార్పు భాజపాతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నారు. 13 రాష్ట్రాల్లో భాజపా, 6 రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమి పాలిస్తోందన్నారు. జమ్మూకశ్మీర్‌లో అత్యధిక సీట్లతో విపక్షంలో ఉన్నాం.. ఎన్నికలు ఎక్కడ జరిగినా భాజపా గెలుస్తుందన్నారు. మహారాష్ట్రలోనూ ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిందని.. తెలంగాణలోనూ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో నిర్వహించిన భాజపా బహిరంగ సభలో నడ్డా ప్రసంగించారు.'కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన



హామీలను అమలు చేయకుండా మోసం చేస్తోంది. ప్రాంతీయ పార్టీలపై ఆధారపడిన పార్టీ కాంగ్రెస్. భాజపాతో నేరుగా తలపడ్డ ఏ రాష్ట్రంలోనూ కాంగ్రెస్ గెలవలేదు. రేవంత్ ప్రభుత్వం ఏడాది పాలనలో అన్ని వర్గాలను మోసం ..మిగతా 2లో

# తెలంగాణ సిగలో మరో మణిహారం

**యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ జాతికి అంకితం**
**మిగులు విద్యుత్తు కలిగిన రాష్ట్రం దిశగా అడుగులు**
**2025 మార్చినాటికి పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి**
**2,400 మెగావాట్ల విద్యుదుత్పత్తికి సన్నద్ధం**
**జాతికి అంకితంచేసిన సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, డిసెంబర్ 7 (ప్రభాత ఉదయం):** తెలంగాణ సిగలో మరో మణిహారం చేరింది. విద్యుత్తు సరఫరాలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్‌వన్ స్థానంలో నిలువనుంది. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ తో దేశంలో ప్రభుత్వ రంగంలో అతిపెద్ద థర్మల్ విద్యుత్ కేంద్రంగా యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ అవతరించింది. దేశ విద్యుత్ రంగానికి దేశానికి కలికితురాయిగా నిలిచిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను సీఎం రేవంత్ రెడ్డి జాతికి అంకితం చేశారు. కేసీఆర్ కలల ప్రాజెక్టు.. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ రాష్ట్రానికి ఆశాదీపమైంది. రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకుండా నిరంతరాయంగా వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ను సరఫరా చేసి మిగులు విద్యుత్తు కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ..మిగతా 2లో



# కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సర పాలనలో తెలంగాణ అస్తవ్యస్తం

**బిజెపి గద్వాల జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి**
**ప్రజా ఆశీర్వాదంతో గెలిచి ప్రజలను మోసం చేస్తావా**
**రేవంత్ రెడ్డి పై మండిపడ్డ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి**

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం) ప్రజా ఆశీర్వాదంతో ఎన్నికల్లో గెలిచిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలకు మోసం చేస్తున్నారనని గద్వాల జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి ఆరోపించారు. శనివారం గద్వాల పట్టణంలోని డీకే బంగ్లా లో బిజెపి కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ... హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టి బడుగు బలహీన వర్గాల వారికి మోసం చేశారన్నారు. మూసి ప్రక్షాళన అంటూ, ఆర్ఆర్ టాక్స్ పేరుతో రేవంత్ రెడ్డి వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. కాళేశ్వరం పేరుతో కెసిఆర్ అవినీతి చేస్తే హైడ్రా, మూసి ప్రక్షాళన పేరుతో రేవంత్ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఎ న్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా అబద్దాలతో కాలం వెళ్లదీస్తునారన్నారు. రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి సీటులో కూర్చునే అర్హత లేనే లేదని తక్షణమే పదవి నుండి వైదొలగాలని డిమాండ్ చేశారు. కొడంగల్ లో ఫార్మసిటీ పేరుతో గిరిజనులకు చెందిన 20 ఎకరాల భూమిని లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారని, గుంట భూమి ఇవ్వకుండా చూస్తామని బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన పోరాటాలు చేపడతామన్నారు. రైతు రుణమాఫీ ఇప్పటివరకు మాఫీ చేయకుండా రైతులను మోసం చేశారని, రైతు భరోసా ఇప్పటికీ ఇవ్వలేదని, ఇందిరమ్మ ఇల్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. మహారాష్ట్రలో లాడ్ కి బహన్ పేరుతో మహిళలకు 1500 రూపాయలు ఇస్తే, మహాలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి

పథకంతో నేలకు 2,500 ఇస్తానన్న సీఎం మాటలు ఏమయ్యాయి అని ప్రశ్నించారు మహిళల వద్దకు కాంగ్రెస్ నేతలు వెళితే వారే ఈ మోసగాళ్లకు గుణపాఠం చెప్తారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీ డైవర్షన్ పాలిటిక్స్ కు పులిస్టాప్ పెట్టండన్నారు. డైవర్ట్ పాలిటిక్స్ కు కేరాఫ్ అడ్రస్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆరోపించారు. డిసెంబర్ 7 న మొదలయిన మోసగాడి పాలన నయవంచక కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ అరాచక పాలనతో ఈ సంవత్సర కాలం లో తెలంగాణ ప్రజలు ఎన్నో నష్టపోయారన్నారు. కాంగ్రెస్ తెలంగాణ లో 12 నెలల పరిపాలన లో ఆరు గ్యారెంటీ లు అమలు చేయకుండా 12 డైవర్ట్ రాజకీయాలు,కాళేశ్వరం ,మెడిగడ్డ అంటూ కాలయాపన చేసింద్రు. వేల కోట్ల విద్యుత్ కుంభకోణం అంటూ కాలయాపన,ఫోన్ ట్యాపింగ్ అంటూ కాలయాపన, ఎంపీ ఎన్నికలు అంటూ 6 గ్యారంటీ లపై దాటవేత ధోరణి,పక్క పార్టీ ఎంఎల్ఏ లను కాంగ్రెస్ పార్టీ లోకి చేర్చుకుంటు ప్రతిపక్షాలకు డైవర్ట్ పాలిటిక్స్ చేస్తూ ఆందోళన కలిగించడం,హైడ్రా అంటూ కాలయాపన,మూసి సుందరి కరణ అంటూ కాలయాపన,డ్రగ్స్,గంజాయి పెరు మీద హంగామా,ఫోర్త్ సిటీ అంటూ ప్రజల దృష్టి మరలరించడం, ఫార్మా సిటీ పేరుతో సొంత నియోజక వర్గం లో చిచ్చు, కులగణన సర్వే పెరు చెప్పి 6 గ్యారెంటీ లపై కాలయాపన., దేనిపై కూడా స్పష్టత ఇవ్వకుండా దాటవేత ధోరణి చేస్తూ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తెలంగాణ ప్రజలను వంచిస్తూ సంవత్సర కాలం గడుపుతున్న మీరు ఒక అసమర్థ ముఖ్యమంత్రి అని నిరూపించుకుంటున్నారు, మళ్ళీ సర్పంచ్ ఎన్నికలు అంటూ మళ్ళీ ఒక 6 నేలలు 6గ్యారెంటీ లను అమలుచేయకుండా తెలంగాణ ప్రజలను మోసం చేయడానికి సిద్ధం అవుతున్నారు. 2025 లో ఈ మీకు పతనం మొదలవుతుంది ఏ ఎన్నికలు అయితే మీకు అధికారం కట్టబెట్టిందో అదే ప్రజల మధ్యలో ఇప్పుడు జరిగే స్థానిక ఎన్నికల్లో మీకు రాష్ట్ర వ్యాప్తంగా జీరో సీట్లు రావడం ఖాయమని జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి ఆరోపించారు...2027 జమిలి ఎన్నికలు రావడం ఖాయమని దేశ వ్యాప్తంగా కేంద్రంలో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఈ దేశ సమగ్రతకు బీజేపీ అధికారంలోకి రావడం ఎంతో అవసరమని తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే,జిల్లా ఉపాధ్యక్షుడు రజక నరసింహ, అసెంబ్లీ మాజీ కన్వీనర్ రామాంజనేయులు, పట్టణ అధ్యక్షుడు బండల వెంకట రాములు,జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ చిత్తారి కిరణ్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దేవదాస్, రాష్ట్ర బిజెవైఎం కార్యవర్గ సభ్యుడు ఢిల్లీ వాలా క్రిష్ణ, ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అనిల్,బిజెపి సీనియర్ నాయకులు పాండు ,గాంజాసాయి,లక్ష్మన్ గౌడ్,తదితరులు ఉన్నారు..

## ఇకపై అత్యంత చౌకగా ఇంటర్నెట్ సేవలు

**మొదటి పేజీ తరువాయి...**

సేవలు అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్నెట్ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకునే విధంగా ఈ తరహా పథకానికి శ్రీకారం చుట్టారు. సాధారణ స్పీడ్ తో పాటు హై స్పీడ్ సేవలను సైతం గ్రామీణ స్థాయి ప్రజలకి ప్రభుత్వం అందించనుంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం భారత్ నెట్ పేరుతో ఈ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం టి ఫైబర్ ద్వారా గ్రామీణ ప్రాంతాలకు అత్యంత తక్కువ ధరకు ఇంటర్నెట్ సేవలను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. తొలి దశలో నారాయణపేట, సంగారెడ్డి, పెద్దపల్లి జిల్లాలోని పలు గ్రామాలకు ఈ ట్రయల్ సేవలను అందించనున్నారు%ొ%ఈ నెల 8 న సీఎం రేవంత్ రెడ్డి ఈ సేవల్ని ప్రారంభించనున్నారు. తొలి దశలో రాష్ట్రవ్యాప్తంగా 94 మండలాలు, 2,096 గ్రామ పంచాయతీల్లో కమర్షియల్ సేవలు అందించేందుకు అధికారులు మ్యాప్ రెడీ చేశారు.

## ప్రజాపాలన దినోత్సవాలు

**మొదటి పేజీ తరువాయి...**

కేసీఆర్‌ను కలిసి రాష్ట్ర ప్రభుత్వం తరపున బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానం అందజేశారు. ముందుగా సిద్దిపేట జిల్లా ఎర్రవల్లి ఫామ్ హౌస్‌కు చేరుకుని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంత్రి పొన్నం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆహ్వాన పత్రిక ఇచ్చి ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈనెల 9న జరిగే కార్యక్రమానికి తప్పకుండా రావాలంటూ పిలిచారు. ప్రజాపాలన విజయోత్సవాలు, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భారాస అధినేత కేసీఆర్‌ను ప్రభుత్వం ఆహ్వానించింది. హైదరాబాద్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్.. రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను, దిల్‌కుషా అతిథిగృహంలో కిషన్‌రెడ్డిని కలిసి ఉత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వానపత్రాలు అందజేశారు. అనంతరం ఎర్రవెల్లికి వెళ్లి మాజీ సీఎం, భారాస అధినేత కేసీఆర్‌ను ఆహ్వానించారు. మంత్రి వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ ఉన్నారు.

## కేసీఆర్ ఏనాడైనా ప్రతిపక్ష పాత్రను పోషించారా?

**మొదటి పేజీ తరువాయి...**

సూచించారు. ఆ దొంగల దోస్తీ చేస్తే... ఆ దొంగల మాటలు పట్టుకుంటే మీరు కూడా అలాగే తయారవుతారన్నారు. మీరు దొంగల బండి ఎక్కితే మీపై ఉన్న గౌరవం కూడా పోతుందన్నారు. ఏడాది పాలనలోనే తాము రూ.21 వేల కోట్ల రుణమాఫీ చేశామని, ప్రధాని మోదీ కానీ, కేసీఆర్ కానీ అలా చేశారా? అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో నల్గొండ పాత్ర మరువలేనిదన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతచారి నల్గొండ జిల్లాకు చెందిన వాడేనన్నారు. నల్గొండలో అడుగుపెట్టినప్పుడు సాయుధ రైతాంగ పోరాటం గుర్తుకువస్తుందన్నారు. నల్గొండలో కృష్ణాజలాలు ప్రవహిస్తే ఫ్లోరైడ్ సమస్య తీరుతుందని ప్రజలు భావించారన్నారు. కాంగ్రెస్ హయాంలో ప్రారంభించిన ప్రాజెక్టులు కేసీఆర్ హయాంలో నిలిచిపోయాయని విమర్శించారు. ఉమ్మడి ఏపీ పాలనలో కంటే కేసీఆర్ పాలనలోనే నల్గొండకు ఎక్కువ అన్యాయం జరిగిందని మండిపడ్డారు. నల్గొండకు కృష్ణా జలాలు తీసుకొచ్చి నేలను సస్యశ్యామలం చేస్తామని హామీ ఇచ్చారు.

## తెలంగాణ సిగలో మరో మణిహారం

**మొదటి పేజీ తరువాయి...**

లక్ష్యంతో గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని చేపట్టింది. నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద సూపర్ క్రిటికల్ టెక్నాలజీతో యాదాద్రి థర్మల్ ప్లాంట్ నిర్మాణాన్ని తెలంగాణ జెన్కో చేపట్టింది. నాలుగు వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఐదు యూనిట్లకు జూన్ 26, 2017న కేంద్ర పర్యావరణ శాఖ అనుమతినిచ్చింది. అదే ఏడాది అక్టోబరు 17న రూ.29 వేల కోట్ల అంచనా వ్యయంతో జెన్ కో నిర్మాణం ప్రారంభించి.. భారత్ హెవీ ఎలక్ట్రికల్ లిమిటెడ్ (బీహెచ్ఇఎల్)కు నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. పవర్ ప్లాంట్ నిర్మాణం అనుకున్న గడువుకన్నా రెండేళ్లు అదనం కావడంతో అంచనా వ్యయం రూ.29,500 కోట్ల నుంచి రూ.34,500 కోట్లకు పెరిగింది. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణాన్ని గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగాయి. ఒకవైపు పనులు ఊపందుకుంటున్న సమయంలోనే ప్లాంట్ నిర్మాణంలో ప్రభుత్వం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది. ఈ ప్లాంట్ లో 50 శాతం దేశీయ బొగ్గును, 50 శాతం విదేశీ బొగ్గును వినియోగించాల్సి ఉండగా, దానికి విరుద్ధంగా నూటికి నూరు శాతం దేశీయ బొగ్గును వినియోగించనుందని రెండు స్వచ్ఛంద సంస్థలు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కి ఫిర్యాదు చేశాయి. దీంతో ఎన్జీటి యాదాద్రి పవర్ ప్లాంట్ రెండో దశ నిర్మాణానికి పర్యావరణ అనుమతులను నిలిపివేసింది. మరోవైపు కరోనా మహమ్మారితో 10వేల మంది కార్మికులు స్వరాష్ట్రాలకు వెళ్లిపోవడంతో రెండేళ్ల పాటు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. రాష్ట్రంలో ప్రభుత్వం మారి కాంగ్రెస్ సర్కార్ ఏర్పడింది. యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణానికి ఎన్జీటీ క్లియరెన్స్‌ను తీసుకోవడంతోపాటు, ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపట్టింది.


తాసిల్దార్ మల్లికార్జున్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

## ప్రభుత్వ ఆసుపత్రులకు సొంత భవనాలను నిర్మించాలి

**సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు నరసింహా**

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం)ప్రభుత్వ ఆసుపత్రులకు సొంత భవనాలను నిర్మించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేర్ నరసింహ డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రుల సమస్యల పరిష్కరించాలని గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు సొంత భవనాలు నిర్మించకుండా నాణ్యమైన వైద్యం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆసుపత్రులకు సొంత భవనాలు లేకపోవడం వల్ల వైద్య సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించడం లేదని అన్నారు. కొత్తపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సంవత్సరాల తరబడి నిర్మాణంలో కొనసాగుతూనే ఉన్నదని, ప్రస్తుత ఆసుపత్రి కూడా అద్దె భవనంలో అది కూడా ఒక గదిలో మాత్రమే నిర్వహిస్తున్నారని అన్నారు. రామ్ నగర్,ఒంటెలపేట లలోని ఆసపత్రులు అద్దె భవనాల్లో కొనసాగుతుండగా బుర్ద పేట లోని పట్టణ ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ టీబీ భవనం లో కొనసాగుతున్నాయని అన్నారు. గద్వాల మండలం, పట్టణ జనాభా కలిపి సుమారుగా లక్షన్నర జనాభా ఉంటుందని అదనంగా ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పల్లె,బస్తి దవాఖానాలకు నైట్ వాచ్ మెన్ లు లేకపోవడం వల్ల ఆసుపత్రులకు భద్రత లేక అసాంఘిక శక్తులు ఆసుపత్రులపై దాడి చేసి విధ్వంసం సృష్టిస్తున్నాయని, రాం నగర్ లోని బస్తీ దవాఖానాలో ఆరు బయట నిత్యం మద్యం బాటిల్స్ దర్శనమిస్తున్నాయని, అంతటితో ఆగక ఆసుపత్రిలోని ల్యాబ్ లు డోర్ల అద్దాలను ధ్వంసం చేశారని అన్నారు ఒంటెల పేట లో అద్దె భవనంలో కొనసాగుతున్న పట్టణ ఆరోగ్య కేంద్రం ప్రస్తుతం భవనం పెచ్చులు ఊడి రోగులపైన పడుతున్నదని, దీనివల్ల రోగులు ఆసుపత్రికి రావడం మానేశారని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసి తగినంత సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు ప్రభుత్వాసుపత్రుల సమస్యల పరిష్కారం అయ్యేవరకు పోరాడుతామని అన్నారు ఈ కార్యక్రమంలో గంజిపేట ఆంజనేయులు, ఇంతియాజ్, ఖాజా మియా, ఎస్ ఎఫ్ ఐ నాయకులు వినోద్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గద్వాలప్రతినిధి, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం)కేటిదొడ్డి మండలంలోని కుచినెర్ల గ్రామ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగప్ప అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్ఐ బి.శ్రీనివాసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. యర్సన్ దొడ్డి గ్రామానికి చెందిన నాగప్ప అనే వ్యక్తి నందిన్నె గ్రామం నుండి యర్సన్ దొడ్డికి బైక్ పై వెళ్లుతుండగా కుచినెర్ల చెరువు కట్టపై చింతలకుంట నుండి నందిన్నె వైపు వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు బైక్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగప్ప చేతికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. నాగప్ప సోదరుడు జనార్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## తెలంగాణలో మార్పు భాజపాతోనే సాధ్యం

**మొదటి పేజీ తరువాయి...**

చేసింది. ఆటో డ్రైవర్లకు రూ.12వేలు ఇస్తామని మోసం చేసింది. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చింది. రూ.15వేల రైతు భరోసా ఇవ్వలేదు. రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామని మాట తప్పింది. ప్రతి మహిళకు రూ.2,500 ఇస్తామని ఇవ్వలేదు. షాదీ ముబారక్ ద్వారా రూ.లక్ష నగదు, తులం బంగారం ఇస్తమని దగా చేసింది‘ అని విమర్శించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు భాజపా ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు సభలో పాల్గొన్నారు.

## మేమిచ్చినన్ని ఉద్యోగాలు మీరిచ్చారా?

**మొదటి పేజీ తరువాయి...**

అడ్డగోలుగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 16వేల మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణలో కేసీఆర్ 7లక్షల కోట్ల అప్పు చేశారని సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము నెలకు 6500కోట్లు వడ్డీ కడుతున్నామని అన్నారు. సంక్రాంతి తర్వాత ఖచ్చితంగా రైతు భరోసా ఇస్తామని హామీ ఇచ్చారు. సన్నాలే పండించండి.. 500 బోనస్ ఇస్తాం.. చివరి గింజ వరకు కొంటాం అని వ్యాఖ్యానించారు. రేషన్ దుకాణాల్లో, హాస్టల్ విద్యార్థులకు మీరు పండించిన సన్నాలతోనే అన్నం పెడతామని అన్నారు. నల్గొండకు 400కోట్లతో రింగ్ రోడ్డు, 35వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్డు, 50వేల ఎకరాల్లో కొత్త నగరాన్ని నిర్మిస్తామని వెల్లడించారు. మూసీ కాలుష్యాన్ని ప్రక్షాళన చేసి తీరుతామంటే బీ ఆర్ ఎస్ అడ్డుపడుతోందని వివరించారు. మూసీ అడ్డుకునే ఏక లింగాన్ని మూసీలో ముంచండి అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటల నల్గొండ జిల్లా ప్రజలే మూసీ ప్రక్షాళనకు అడ్డువచ్చే వారిని చూసుకోవాలి అంటూ హాట్ కామెంట్స్ చేశారు. ఎన్ని కష్టాలు వచ్చినా మూసీ ప్రక్షాళన చేసి తీరుతామంటూ.. పునరుజ్జీవనం చేసి గోదావరి జలాలు ఇస్తామని అన్నారు.

**జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు స్వీకరించిన బాలకృష్టా రెడ్డి కి పుష్పగుచ్చం అందజేస్తున్న హైదరాబాద్ డిపో-1 మేనేజర్ కృష్ణారెడ్డి**



## జేఎన్టీయూ విసిగా వి బాలకృష్ణారెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం) జె యం టి యు వైస్ ఛాన్సలర్ గా వి బాలకృష్టా రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారి చేసింది. శనివారం నల్సార్ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ గా ఉన్న బాలకిస్టా రెడ్డి కి రాష్ట్ర ప్రభుత్వం జేఎన్టీయూ ఉపకులపతిగా అదనపు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా హైదరాబాద్ డిపో 1 మేనేజర్ కృష్ణారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.




గగన్ పహడ్ లోని కమ్యూనిటీ స్తలం.. తవ్వకాలు జరిపిన గుర్తు తెలియని వ్యక్తులు

## గగన్ పహడ్‌లోని కమ్యూనిటీ స్థలాన్ని కాపాడాలి

బుద్వేల్, డిసెంబరు7(ప్రభాత ఉదయం): గగన్ పహడ్ లో గల 2,400 గజాల కమ్యూనిటీ స్థలాన్ని కాపాడాలని సంవత్సర కాలంగా అదికారుల చుట్టూ తిరుగుతున్న పట్టించుకోవడం లేదని ఆ బస్తీకి చెందిన తలారి శ్రీరాములు, ఎన్ ధనుంజయ, జోగి శేఖర్, కిరణ్, జోగి అశోక్ , బి గణేష్ , టి ఈశ్వరయ్య , శ్రీను, టి ఎల్లయ్య, బి లక్ష్మణ్, టీ పాండు , బి సుభాష్ లు వాపోయారు. స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించాలని, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం ఆ స్థలాన్ని ఉపయోగించాలని అధికారులకు విన్నవించుకున్న పట్టించుకోవడంలేదని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ స్థలంని కబ్జ చేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, జీహెచ్ఎంసీ అదికారులు స్పందించి గగన్ పహడ్ లోని ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని కోరారు.

## వ్యవసాయ విశ్వవిద్యాలయం వత్రోత్సవాలకు తోడ్పాటు అందిస్తా : ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్

జయశంకర్ వర్శిటీ, డిసెంబరు7 (ప్రభాత ఉదయం) : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ ం వత్రోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేయనున్న ఫైలాన్ నిర్మాణానికయ్యే రూ.30 లక్షలను శాసనసభ నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి కేటాయించడానికి తాను సిద్ధంగా ఉన్నానని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అన్నారు. శనివారం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని ఆయన సందర్శించారు. పరిపాలన భవనంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్యను కలసి అభినందనలు తెలియజేశారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అపార అనుభవం ఉన్న ఒక బీసీ వ్యక్తిని వ్యవసాయ విశ్వవిద్యాలయానికి మొదటి సారిగా వైస్ చాన్సలర్ గా నియమించడం అభినందనీయమైన విషయమన్నారు. అందుకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలిపారు. ఈ సం దర్భంగా వర్శిటీ ఉప కులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య. రిజిస్ట్రార్ డి.శివాజీ, ఇతర విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులతో ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ సమావేశమై అనేక అంశాల గురించి విపులంగా


ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ను కలిసిన ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

చర్చించారు. విశ్వవిద్యాలయం భూములు, అస్తుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎమ్మెల్యే సూచించారు. భూముల పరిరక్షణకు ప్రహరీగోడలను నిర్మించాలన్నారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తాను అన్ని విదాలుగా సహకారం అం దజేస్తానన్నారు. డిసెంబరు నెలలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రో త్సవాలను నిర్వహించనున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఎమ్మెల్యే కు వివరించారు. వజ్రొ త్సవాలలో పాల్గొనాలని ఏమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. అం దుకు ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ తప్ప కుండ వశ్రోతవాలలో పాల్గొంటానన్నారు.

# నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా బ్యాంకర్లు రుణాలు అందించాలి: ఎంపీ డాక్టర్ మల్లు రవి

గద్వాల జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం) నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా బ్యాంకుల ద్వారా విరివిగా రుణాలు అందించాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు దిశ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశాన్ని ఆలంపూర్ శాసనసభ్యులు విజయుడు,జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా పార్లమెంటు సభ్యులు మల్లు రవి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వము నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. స్వయం ఉపాధి కొరకు బ్యాంకు రుణాల కోసం దరఖాస్తు చేసుకునే నిరుద్యోగులకు రుణాలను మంజూరు చేసి వారికి ఉపాధికి కల్పించేందుకు బ్యాంకర్లు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల కింద రుణాలను మంజూరు చేయాలన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న పథకాలను గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని బ్యాంక్ అధికారులకు సూచించారు. బ్యాంకు ఉన్నత అధికారులు రుణాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజక వర్గంలో రుణమేళాలు నిర్వహించి ఎక్కువ మందికి రుణాలు అందించేందుకు బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగియడానికి గడువు సమీపిస్తున్నందున లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంక్ ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని వివిధ పథకాల క్రింద కేటాయించిన యూనిట్లు మంజూరు అయ్యేలా చూడాలని సూచించారు. ఇప్పటి వరకు ఎన్ని యూనిట్లు మంజూరు అయ్యాయి, పెండింగ్ లో ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసు కొన్నారు. జిల్లాలోని బ్యాంకులు అవసరమైన రుణాలు అందచేస్తున్నాయా? లేదా? అనే విషయాలను లీడ్ బ్యాంకు మేనేజర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా జిల్లాలో నిరుద్యోగ యువతకు కేంద్ర ప్రభుత్వ పథకాలైన ముద్ర, పిఎం ఈజిపి, పీఎం విశ్వకర్మ, పీఎం స్వానిధి, ఎస్ఎంఈ పథకాల ద్వారా ఉపాధి కల్పించే విధంగా యువతకు విరివిగా రుణాలను అందించాలన్నారు. అర్హులైన వారికి రుణాలు అందించి వారికి ప్రోత్సాహం అందించాలని సూచించారు. ఈనెల 21న వనపర్తిలో రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా యువతకు స్వయం ఉపాధి కల్పించే దిశగా వృత్తి నైపుణ్యం, రుణ మేళా, జాబ్ మేళాలు నిర్వహించి స్వయం ఉపాధి కల్పించినట్లు తెలిపారు. ఎస్సీ ,ఎస్టీ, బీసీ, మైనారిటీ రుణాలకు సంబంధించి గ్రౌండ్ చేసిన రుణాలకు బ్యాంకుర్లు వెంటనే యుటిలైజేషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని సూచించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన లక్షాల మేరకు విరివిగా రుణాలను మంజూరు చేయాలని ఆదేశించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అమలు చేస్తున్న పథకాలపై శాఖల వారిగా సమీక్షించారు. ఇందులో భాగంగా వ్యవసాయ శాఖ, వైద్యశాఖ, విద్యాశాఖ, జిల్లా శిశు సంక్షేమ శాఖ, మిషన్ భగీరథ, ఎస్సీ ఎస్టీ బీసీ శాఖలు, పంచాయతీ శాఖ, పౌర సరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, తదితర శాఖలు అమలు చేస్తున్న పథకాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యా శాఖలో మధ్యాహ్న భోజనం, పాఠశాలలో మరుగుదొడ్లు, త్రాగునీరు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఫుడ్ పాయిజన్ జరగకుండా అధికారులు ఎప్పటికప్పుడు వసతి గృహాలలో తనిఖీలు నిర్వహించాలన్నారు. మిషన్ భగీరథ నీటిని అన్ని పాఠశాలకు అందించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ ప్రజలకు అందే విధంగా అధికారులు విశేష కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డి సి సి బి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కేశవ్,మాజీ జెడ్పీ చైర్ పర్సన్ సరిత, జిల్లా వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, బ్యాంకర్లు, కౌన్సిలర్లు దిశ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న పార్లమెంటు సభ్యులు డాక్టర్ మల్లురవి


జాహ్నవి-సూర్యల నిశ్చితార్థం లో పాల్గొన్న కుటుంబ సభ్యులు

## కన్నుల పండుగగా జాహ్నవి-సూర్యల నిశ్చితార్థం

బుద్వేల్,డిసెంబరు7(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ సర్కిల్ భవాని కాలనీ వాస్తవ్యులు తాళ్ల కృష్ణ-తాళ్ల పద్మ (గీత)ల కుమార్తె జాహ్నవి నిశ్చితార్థము శనివారం రేతిబౌలి పద్మనాభ నగర్ వాస్తవ్యులు గూడూరు సతీష్ -గూడూరు శ్రీదేవి ల కుమారుడు సూర్య తో ఘనంగా జరిగింది. నగరంలోని కిన్నెర గ్రాండ్‌లో జరిగిన నిశ్చితార్థ వేడుకలలో ఇరు కుటుంబాల సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు. నిశ్చితార్థ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి.


సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ నూతన అధ్యక్షులు కొండకల్ల నాగేందర్ రెడ్డి

## రంగారెడ్డి జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం కోసం కృషి చేస్తా:

### రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అ్యధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి

రాజేంద్రనగర్, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం)రంగారెడ్డి జిల్లాలో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం కోసం కృషి చేస్తానని రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అ్యధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన కొండకళ్ల నాగేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా అభివృద్ధి పరుస్తున్నారన్నారు. ఇటీవల జరిగిన జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవీ ఎన్నికల్లో కొండకళ్ల నాగేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఈ సందర్భంగా తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ముఖ్యమంత్రితో సమావేశమై జిల్లాలో చేపట్టబోయే కార్యక్రమాలపై నాగేందర్‌రెడ్డి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి అభివృద్ధి, సంక్షేమ పథకాన్ని అర్హులైన ప్రతి గడపకు అందించేందుకు తమ సాయశక్తుల కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. ఇందుకు ప్రతి నాయకుడిని, కార్యకర్తను కలుపుకుంటూ ముందుకు సాగుతామని వివరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వారిలో ముఖ్య నాయకులు రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు , తెలంగాణ స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి , రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్ష అభ్యర్థి జెక్కిడి శివచరణ్‌రెడ్డి , యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి శ్రావణ్‌రావు , తదితరులు పాల్గొన్నారు.

## నా కుమారుని వివాహానికి రండి

### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరిన టీటీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎం.రామేశ్వర్ రావు

బుద్వేల్, డిసెంబరు7 (ప్రభాత ఉదయం): ఈ నెల 11న సాయంత్రం 7గంటలకు శంషాబాద్ మల్లిక కన్వెన్షన్ వేధికగా జరిగే తన కుమారుడు డాక్టర్ రాహుల్ వివాహ మహొత్సవానికి హాజరు కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని టీ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మ్యాడం రామేశ్వర్రావు కోరారు. ఈ మేరకు శనివారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని మంత్రి జూపల్లి కృ ష్ణారావు తో ఆయన కలిశారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని రామేశ్వర్ రావు శాలువాతో సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు మ్యాడం మధుసూదన్ లు ఉన్నారు.


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పెళ్లి పత్రిక ఇచ్చి ఆహ్వానిస్తున్న టీ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిది మ్యాడం రామేశ్వరరావు


స్వయం పాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

## బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పాలన దినోత్సవం


బుద్వేల్, డిసెంబరు7 (ప్రభాత ఉదయం): బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వయం పాలన దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు కనబరిచిన ప్రతభకు మెచ్చిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభిందించారు.

## రాజేంద్రనగర్ మండల టీపీయుఎస్ నూతన కమిటీ

బుద్వేల్, డిసెంబరు7(ప్రభాత ఉదయం): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయు ఎస్) రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కోట్ల కాశీరావు ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ మండలానికి నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ మండల గౌరవ అధ్యక్షులుగా ఎ.వినోద్ కుమార్, అద్యక్షులుగా బుదగని బాలక్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా గుంజారి బాలక్రిష్ణ, కోశాధికారిగా అవుల అనిల్ కుమార్, మహిళా కన్వీనర్ గా బుద్ధం విజయమ్మ, ఉపాద్యక్షురాలుగా బి.నాగమణి, ఎం పికైనారు. ఈ కార్యక్రమంలో టీపీయుఎస్ రాజేంద్రనగర్ మండల సభ్యులు ఎం.పి రాజు, గోపాల్, లు పాల్గొన్నారు.



టీపీయుఎస్ రాజేంద్రనగర్ మండల కమిటి సభ్యులు



బండ్ల గూఢ భవానీ నగర్ కాలనీ కమిటి సభ్యులు

## భవానీ నగర్ కాలనీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తా : సయ్యద్ ఖాజ

బండ్లగూడ, డిసెంబరు7(ప్రభాత ఉదయం): బండ్లగూడ కాళీ మంది కాళీ మందిర్ సమీపంలో గల భవానీ కాలనీ భవాని నగర్ కాలనీ అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు సయ్యద్ ఖాజా అన్నారు భవాని నగర్ కాలనీ అసోసియేషన్ నూతన కమిటీ సమావేశం శనివారం కాలనీలో జరిగింది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీవాసులు అందరూ ఐక్యంగా ముందుకు సాగితే సమస్యలను అన్నిటిని పరిష్కరించుకోవడానికి సులభం ఉంటుందన్నారు కాలనీ సొసైటీకి సలహాదారులుగా ఎంఎం ఖాన్ ఉంటారని తెలిపారు ఎలాంటి సమస్యలు ఉన్న వాటిని ఐక్యంగా పరిష్కరించుకుందామంటూ పిలుపునిచ్చారు

**నూతన కమిటీ :**

భవాని నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా సయ్యద్ ఖాజ, ఉపాధ్యక్షులుగా సిహెచ్ ఆంజనేయ ప్రసాద్ , ప్రధాన కార్యదర్శిగా నెలటూరి రాజా రామ్, సంయుక్త కార్యదర్శిగా పి రామ్ కుమార్, కోశాధికారిగా ఎం జైపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎండి నయీమ్, పి రాజారత్నం, మల్లేష్, మహమ్మద్ యూసుఫ్, ఇస్మాయిల్, ఈశ్వర్ రెడ్డి, ముఖ్య సలాహాదారులుగా ఎం ఎం ఖాన్ నియమితులయ్యారు.



## శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం మహొత్సవం

కొత్తకోట, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం) కొత్తకోట , మదనాపురం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో. గురు స్వామి బ్రహ్మ స్వామి ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమం నిర్వహించారు. శ్రీ అయ్యప్ప స్వామి మహా పడిపూజ ఊరేగింపు మహొత్సవంలో మున్సిపల్ చైర్మన్ సుకేశిని విశ్వేశ్వర్, కొత్తకోట మండల మాజీ ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్, మాజీ సి డి సి చైర్మన్ చెన్నకేశవరెడ్డి,మాజీ సర్పంచ్ ఆకుల శ్రీనివాసులు, మదనాపురం మాజీ మార్కెట్ డైరెక్టర్ భాగ్యలక్ష్మి ఎల్ఐసి కృష్ణ గౌడ్ ,మాజీ కురుమూర్తి దేవస్థానం కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,%దీ=ా%కొత్తకోట పట్టణ మహిళా అధ్యక్షురాలు బీమా లక్ష్మీ ప్రసన్న, పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఆశీర్వాదం తీసుకున్నారు.



విలేకరుల సమావేశంలో పాల్గొన్న హేమ జిల్లోజు,తదితరులు

## పుష్ప 2 బెనిఫిట్ షో వద్ద జరిగిన తొక్కిసలాటలో మరణించిన రేవతి కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలి

### రేవతి కుమారునికి మెరుగైన వైద్యం అందించాలి

### ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు హేమా జిల్లోజు

హైదారాబాద్,డిసెంబరు7(ప్రభాత ఉదయం): పుష్ప 2 బెనిఫిట్ షో సందర్భంగా మరణించిన రేవతి కుటుంబానికి న్యాయం చేయాలని ఆమ్ ఆద్మీ పార్టీ మహిళా విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు హేమాజిల్లోజు డిమాండ్ చేశారు. ఇది అంశంపై శనివారం లిబర్టీ లోని ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. విలేకరుల సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ మహిళా అధ్యక్షురాలు. రాజేంద్రనగర్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే హేమా జిల్లోజు, ఎక్స్ కన్వీనర్, కోర్ కమిటీ మెయిన్ మెంబర్ బుర్ర రాము గౌడ్, కోర్ కమిటీ సభ్యుడు మహమ్మద్ మస్జిద్, మల్కాజిగిరి కోశాధికారి శివాజీ, స్పోక్స్ పర్సన్ జావిద్, కొడంగల్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పుష్ప 2 సినిమా ఈనెల 4వ తారీకు బెనిఫిట్ షో సందర్భంగా అల్లు అర్జున్ ఆర్టీసీ క్రాస్ రోడ్డు సంధ్య థియేటర్ కి రావడం వల్ల, థియేటర్ దగ్గర జరిగిన తొక్కిసలాట విషాదంలో చనిపోయిన రేవతి బాధితురాలి, భర్తతో మాట్లాడడం జరిగిందన్నారు. వాళ్ల బాబు పరిస్థితి కూడా చాలా విషమంగా ఉందని , వెంటి లేటర్ మీద పెట్టారని చెప్పారని ఆయన తెలిపారని గుర్తు చేశారు. నిన్న అల్లు అర్జున్ రూ.25 లక్షలు చనిపోయిన రేవతికి వెలకట్టారు. కేవలం అల్లు అర్జున్ రావడం వలనే ఒక ప్రాణానికి నష్టం జరిగింది. అలాగే తన కొడుకు చావు బ్రతుకుల మధ్యలో ఉన్నాడు. కొంతమందికి గాయాలు అయి ఆసుపత్రుల పాలు అయినట్టుగా తెలుస్తుంది. ఒక మనిషి ప్రాణానికి రూ.25 లక్షలు వెలగడుతున్నావ్ బెనిఫిట్ షో వల్ల ఒక టికెట్ కి రూ .1100 రూపాయల పైగా వసూలు చేశారు. ఆ ఒక్కరోజు బెన్ఫిట్ షో సినిమాకు వసూల్ అయిన రుసుము 100కోట్లపైన . మైత్రి మూవీస్ యజమాన్యం సినిమా ఖర్చు ఎక్కువైనది,అని మీ నష్టం భర్తీ చేసుకోవడానికి బెనిఫిట్ షో వేసి మీ యజమాన్యం లబ్ధి పొంది ,జనాల ప్రాణం మీదికి తెచ్చారు . జరిగిన ప్రాణ నష్టానికి రూ.25 కోట్లు ఇచ్చిన తక్కువే? అలాంటిది 25 లక్షల తోని చేతులు దులుపుకుందామని చూస్తున్నావు అల్లు అర్జున్. నీ ఫ్యామిలీలో ఇలానే జరుగుతే నువ్వు ఊరుకుంటావా . హీరో ఇజం అనేది సినిమాలోనే కాదు, నిజ జీవితంలో కూడా చూపించాలి. మీ మామ పవన్ కళ్యాణ్ లాగా సమస్య ఉన్న దగ్గరికి వెళ్లి పరిష్కరించడం చేయాలి. అది వదిలి సోషల్ మీడియా ద్వారా రూ .25 లక్షలు ప్రకటిస్తున్నాను అని చెప్తున్నావు . నీ నిర్లక్ష్యం వల్ల నిండు ప్రాణం బలి అయ్యింది . దాన్ని ఒక మనిషిలాగ ఆలోచించు నీకున్న స్తోమతకు తగ్గట్టుగా ఆలోచించు . ఈరోజుల్లో ఒక కిడ్నీ మారుస్తేనే కోటి రూపాయలు, రెండు కోట్లు అలా ఉంది. ప్రతి అవయవానికి ఒక్కొక్క రేటు పెట్టి ఒక మనిషికి రూ .12 నుంచి రూ .25 కోట్లు ఉంటుంది . అలాంటిది ,నీ నిర్లక్ష్యానికి ఒక ప్రాణం ఖరీదు రూ . 25 లక్షలా? ఒక నిండు ప్రాణాన్ని తీసుకురాలేవు. కనీసం ఆ లోటునైనా తీర్చే ప్రయత్నం న్యాయంగా చెయ్యి. ఈ సమస్యను రేపటి లోపు పరిష్కారం చెయ్యకపోతే, అల్లు అర్జున్ ఇంటి ముందట, మైత్రి మూవీస్ ఆఫీస్ దగ్గర, అలాగే సినిమా ఆటోగ్రఫీ మంత్రీ కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఇంటి ముందట ఆమ్ ఆద్మీ పార్టీ ధర్నా నిర్వహిస్తుందన్నారు.

## బీజేపీ సభకు తరలిన నాయకులు


బీజేపీ సభకు తరలిన నాయకులు


పార్టీ జాతీయ అధ్యక్షుడు జే పి నడ్డ ను కలసిన కాంటేస్టేడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి


రాజేంద్రనగర్ బీజేపీ నాయకులు

బుద్వేల్, డిసెంబరు7(ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై బీజేపీ శనివారం సరూర్ నగర్ స్టేడియం లో నిర్వహించిన బహిరంగ సభకు రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి, బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్లతో పాటు ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొన్న సభకు బీజేపీ శ్రేణులు తరలివెళ్ళారు.

## ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా 2కే రన్


2కే రన్‌లో పాల్గొన్న అడిషనల్ కమిషనర్ యాదగిరి రావు, జోనల్ కమిషనర్ టి వెంకన్న, డిప్యూటీ కమిషనర్ కె రవికుమార్ లు



2కే రన్‌లో పాల్గొన్న యువకులు

బుద్వేల్, డిసెంబరు7(ప్రభాత ఉదయం): ప్రజా పాలన ప్రారంభమై సంవత్సరం పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ప్రజా విజయోత్సవాలలో భాగంగా శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. పీడీపీ చౌరస్తా నుంచి రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ రన్ లో గ్రేటర్ అదనపు కమిషనర్ (స్పోర్ట్స్) యాదగిరి రావు, దక్షిణ మండలం జోనల్ కమిషనర్ టి.వెంకన్న, రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె. రవి కుమార్, డిప్యూటీ కమిషనర్లు జయంత్, సురేందర్, సరిత, అరుణ, సూపరింటెండెంట్ ఇంజనీర్ మహేశ్వర్, ఈఈ నరేందర్ గౌడ్, మెడికల్ ఆఫీసర్ రజనీకాంత్, జోనల్ స్పోర్ట్స్ ఇన్స్పెక్టర్ రవూఫ్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జిహెచ్ఎంసి ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయం

**మూసి అభివృద్ధితో హైదరాబాద్‌కు మరింత ఖ్యాతి... అభివృద్ధికి శ్రీకారం చుట్టిన సీఎం రేవంత్ రెడ్డి... లోకల్ బాడీ ఎన్నికలలో గెలిపించి సీఎం రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇస్తాం.... బిజెపి బిఆర్ఎస్ ఒకటై కాంగ్రెస్ ప్రభుత్వం పై విష ప్రచారం చేస్తున్నాయి.... 6 గ్యారంటీల అమలుతో రాష్ట్రం మరింత అభివృద్ధి:మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత..**

కూకట్‌పల్లి, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం) గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సీఎం రేవంత్ రెడ్డికి బహుమతిగా ఇస్తామని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డి,ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత అన్నారు. ప్రజా పాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బి బ్లాక్ కమిటీ ఆధ్వర్యంలో కూకట్ పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, సాధు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో ఆసియాలో అతిపెద్ద కాలనీగా పేరుందిన కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలో టెంపుల్ బస్ స్టాప్ లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ విజయోత్సవ సభా కార్యక్రమానికి హరివర్ధన్ రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత, కూకట్ పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఆరు గ్యారెంటీ ల హామీతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అయితే గత ప్రభుత్వం కేసీఆర్ హయంలో ఆర్థిక విధ్వంసం చేసిందన్నారు. ప్రజల కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతుంటే భారత రాష్ట్ర సమితి భారతీయ జనతా పార్టీలు ఏకమై అడ్డుకొని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రెండు లక్షల రుణమాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం దేశం దృష్టిని ఆకర్షించింది అన్నారు. బిజెపి, బీఆర్ఎస్ ఒక్కటేనని చీకట్లో ఒప్పందాల కుదుర్చుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తున్నాయని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ సర్వతో ముఖాభివృద్ధికి కృషిలో భాగంగా మూసి ప్రక్షాళనతో హైదరాబాద్ నగర ఖ్యాతిని పెంచడంతోపాటు కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత రంగారెడ్డి, నల్గొండ జిల్లా రైతులకు మేలు చేసే కార్యక్రమాన్ని చేపడితే బిజెపి, బీఆర్ఎస్ లు అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించిన మూసి అభివృద్ధి ప్రక్షాళన ఆగదని అన్నారు. 6 గ్యారంటీలను అమలు చేసి రాష్ట్రంలో ఉన్న నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపుతారని ఈ సందర్భంగా తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలో జరిగే ఏ స్థానిక సంస్థల ఎన్నికల్లోనైనా కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మ్రోగిస్తుందన్నారు. ప్రజలు ప్రతిపక్షాల దురుద్దేశ పూరిత విమర్శలకు ఆకర్షితులై వారి మాటలు నమ్మితే నష్టపోతారన్నారు. కూకట్ పల్లి నియోజకవర్గంలో సైతం కాంగ్రెస్ ప్రభుత్వం పలు ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల సంక్షేమాన్ని కృషి చేస్తుందన్నారు. కార్పొరేషన్




చైర్మన్ కాల్వ సుజాత మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుఖ సంతోషాలతో ఉన్నారని అన్నారు. ఇప్పటికే మహిళలు ఉచితంగా బస్సు ప్రయాణంతో పాటు పలు సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు తమ్మినేని ప్రవీణ్ కుమార్, కృష్ణా రాజ్ పుత్, ఫణీంద్ర కుమార్, సంజీవరావు, మేకల మైకల్, పొడుగు అప్పారావు, సంధ్య, రేష్మ, జోజమ్మ, 114 డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రంగస్వామి, శివ చౌదరి, కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, బుచ్చి మల్లి, బాల్నగర్ డివిజన్ యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ సోను, శ్రీధర్ చారి, రాజు ముదిరాజ్, గిరి నాయుడు, మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కాలనీవాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## ప్రజలు ఆరోగ్య భద్రతకు ప్రతి ఒక్కరు భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి**

కూకట్‌పల్లి, డిసెంబర్ 7 (ప్రభాత ఉదయం) ప్రతి ఒక్కరూ ఆరోగ్య భద్రత విషయంలో భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మెడ్విల్ ఇన్సూరెన్స్ బ్రోకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ను అమీర్ పేట్ సర్కిల్ లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ ఎన్ వాణి, మూసాపేట్ డిప్యూటీ కమిషనర్ బి వంశీకృష్ణ, ఎం రాజరత్నం డిఎఫ్ఓ, డాక్టర్ సతీష్, రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న ప్రకారం ముఖ్యంగా మనుషులకు, వస్తువులకు ఇన్సూరెన్స్ చాలా అవసరమని, ఆరోగ్య రీతిగా మోటార్ వెహికల్స్, గృహ పరికరాలు, ప్రతిదానికి ఇన్సూరెన్స్ ఎంతో ముఖ్యమని జేబులో డబ్బు లేకున్నా మనకు ఇన్సూరెన్స్ ఉంటే మనం ఆరోగ్యంగా ఉంటామని తెలిపారు. ఇన్సూరెన్స్ వల్ల హాస్పిటల్ లో ఏ వ్యాధినైనా నయం చేసుకోవడానికి ఆరోగ్యంగా ఉండటానికి ఎంతో మేలు చేస్తుందని, కాబట్టి ప్రతి ఒక్కరు ఆలోచించి ఇన్సూరెన్స్ చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మెడ్విల్ మేనేజింగ్ డైరెక్టర్ జి. ఈశ్వర్ రావు, కమిటీ సభ్యులు నాగేందర్ రెడ్డి, అమర్ నాథ్ రెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలు ప్రజలలో ఎంతో ఆనందాన్ని వ్యక్తపరుస్తున్నాయి

**ఏ బ్లాకు ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి**


కూకట్‌పల్లి, డిసెంబర్ 7 (మెట్రో ఉదయం) కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో నేడు ప్రజలు ఎంతో సంతోషంగా జీవనం గడుపుతున్నారని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాకు ఉపాధ్యక్షులు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి నేటికీ సంవత్సరం కావస్తున్న సందర్భంగా కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆదేశానుసారం కూకట్ పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ లోని ఇంద్రానగర్, ఎన్టీఆర్ నగర్, శ్రీశ్రీనగర్ ప్రాంతాల్లో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఇంటింటికి విస్తృతంగా తిరిగి కాంగ్రెస్ పథకాలను ప్రచారం చేశామన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సంవత్సరం క్రితం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలుపరుస్తూ ప్రజల ఆదరాభిమానాలను చూడకుంటున్నామని అన్నారు. ఉచిత విద్యుత్తు, రూ.500 కే గ్యాస్ సిలిండర్, ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం లాంటి సంక్షేమ పథకాలు ప్రజల్లో ఎంతో ఆదరాభిమానాలు పొందుతున్నాయని గర్వంగా చెప్పుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధు గౌడ్, మాజీ కౌన్సిలర్ లక్ష్మయ్య, గజానంద్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్

## ప్రభుత్వ ఉద్యోగాలలో వికలాంగులకు రిజర్వేషన్లు పెంచిన వ్యక్తి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ: మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్

కూకట్‌పల్లి, డిసెంబర్ 7 (ప్రభాత ఉదయం)2024 ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలు కూకట్‌పల్లి నియోజకవర్గం న్యూ శక్తి దివ్యంగుల సంస్థ వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంపిని న్యూ శక్తి వికలాంగుల సంస్థ అధ్యక్షులు వెంకటస్వామి, కార్యదర్శి చిరంజీవి, సభ్యులు వారికి స్వాగతం పలికి ఈటెల రాజేందర్ ని సన్మానించారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ అంగవైకల్యం ఉన్న వారు వికలాంగులు, దివ్యంగులు కారని మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికలాంగులను గౌరవిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలలో వికలాంగులకు రిజర్వేషన్లు వాటాను పెంచి మానసికంగా వారికి ధైర్యాన్ని ఇచ్చినటువంటి వ్యక్తి మన ప్రధానమంత్రి ని వారు తెలియజేశారు. గతంలో అనేకసార్లు దివ్యాంగుల సమస్యలపై నేను పోరాటం చేశానని, భవిష్యత్తులో కూడా వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి భరోసా ఇస్తున్నాను అని తెలిపారు. తదనంతరం కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. దివ్యాంగులకు వీల్ చైర్ లను, మూడు చక్రాల ఎలక్ట్రిక్ వాహనాలను దివ్యాంగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లీ అసెంబ్లీ ఇంచార్జ్ మాధవరం కాంతారావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, డివిజన్ అధ్యక్షులు, ఇతర సంఘాల నాయకులు, దివ్యాంగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తుంది: ఎమ్మెల్యే జిఎంఆర్

కొత్తకోట, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కానయపల్లి గ్రామంలో మహిళలను కోటీశ్వరులను చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ఇందిరా మహిళా శక్తి పథకం లో భాగంగా నేడు 38 మహిళ సంఘాలకు 4 కోట్ల 37 లక్షల రూపాయల వడ్డీ లేని రుణాలను (చెక్కును) ,నాటు కోళ్ల ఫామ్ కోసం 6లక్షల18 వేల (వడ్డీ లేని రుణం) చెక్కులను మహిళా సంఘాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆర్డర్ మేరకు విద్యార్థులకు యూనిఫామ్ కుట్టినందుకు గాను 1,68,000 రూపాయలను మరియు గతంలో ఎన్నడు లేని విధంగా మహిళ సంఘాల్లోని సభ్యుల ఇన్సూరెన్స్ కింద 1,80,714 రూపాయల చెక్కులను వారి కుటుంబ సభ్యులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ...రాష్ట్రంలో మహిళలకు పెద్దపీఠ వేస్తూ వారిని లక్షధికారులను, కోటీశ్వరులను చేయడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఇచ్చిన హామీ మేరకు ఉచిత బస్సు సౌకర్యం, రూ. 500 లకే సిలిండర్ ఇస్తున్నామన్నారు.మహిళలను మహాలక్ష్మి గా ప్రజా ప్రభుత్వం గౌరవిస్తుందన్నారు. సమాజంలో సగభాగం ఉన్న మహిళలు సాధికారత సాధించే లక్ష్యంగా, ప్రజా ప్రభుత్వం అనేక ప్రణాళికలు తీసుకొని ముందుకు వెళుతుందన్నేరు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు సాధికారత కల్పించాలని నిర్ణయించి, ఆదాయ వనరులు పెంచుకోవడానికి ప్రోత్సహిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. గ్రామీణ మహిళలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం అయ్యేందుకు మా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 65 లక్షల మంది ఉన్న డ్వాక్రా మహిళా సభ్యులను కోటి వరకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యం.మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించాలని మా ప్రభుత్వము ప్రతి సంవత్సరం 20 వేల కోట్ల రూపాయల వడ్డీ లేని రుణాలను అందించాలని నిర్ణయం తీసుకున్నది.మహిళా సమాఖ్యల వ్యాపార వృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం శిల్పారామంలో ఇందిరా మహిళ శక్తి బజార్ ను ప్రారంభించింది.మహిళా సాధికారతలో భాగంగా మన ప్రభుత్వం స్కూల్ యూనిఫామ్ లను కుట్టే బాధ్యత, ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాల బాధ్యతలను ఐకేపీకి అప్పగించింది.ఇందిరా శక్తి పథకం'లో పెరటికోళ్ల పెంపకం, ఇందిరా డెయిరీ, మిల్క్‌పార్లర్లు, ఈవెంట్ మేనేజ్మెంట్, మహిళ క్యాంటీన్ తదితర వినూత్న పథకాలతో మహిళలను వ్యాపార రంగంలో ప్రోత్సహిస్తున్నాం.మహిళ సంఘాల సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగంలో రాణించాలన్నారు.

## మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలు

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

హైదరాబాద్, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం) మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేలా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని... ఇందులో భాగంగానే ఏటా రూ. 20వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందిస్తున్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల మేర రుణాలు మహిళలకు ఇవ్వాలని నిర్దేశించుకున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. పర్యాటక భవన్‌లో తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతో కలిసి భట్టి విక్రమార్క ప్రారంభించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలకు చెందిన ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన స్టాళ్లు పరిశీలించిన భట్టి.. అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. భవిష్యత్తులో అవి మధ్య, భారీ పరిశ్రమలుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగేలా ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. గ్రామీణ మహిళల్లోనూ వ్యాపారదక్షత ఉంటుందని.. పర్యావరణానికి హాని కలగకుండా చేసే ఉత్పత్తులను ఆదరించాలని భట్టి కోరారు.

# రేషన్ డీలర్ల నుంచి బ్లాక్ మార్కెట్‌కు రేషన్ తరలింపు..!

**లబ్ధిదారుల నుండే డీలర్లు బియ్యం కొనుగోలు దళారులతో కలిసి డీలర్ల అక్రమ వ్యాపారం? రేషన్ దుకాణాల్లో కరువైన తనిఖీలు పట్టించుకోని రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ అధికారులు**

గద్వాల ప్రతినిధి, డిసెంబర్ 7(ప్రభాత ఉదయం) గద్వాల జిల్లాలో జిల్లాల రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. ప్రతి రోజు రేషన్ మాఫీయా అక్రమంగా పొరుగున్న ఉన్న కర్ణాటక రాష్ట్రానికి తరలిస్తున్న క్రమంలో ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన కేసులే నిదర్శనం. ఎక్కువగా రేషన్ షాపుల నుండి రేషన్ బియ్యం పక్కదారిపఢుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. రేషన్ డీలర్లతో కలిసి అక్రమార్కులు కర్ణాటకకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు, పట్టణాలలో, మండల కేంద్రాలలో, పలు గ్రామాలలోని రేషన్ దందా జోరుగా సాగుతోంది. రేషన్ డీలర్లు లబ్ధిదారుల నుండి నేరుగా కిల్లో రూ.10 నుండి 12 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు చేసిన బియ్యాన్ని వివిధ వాహనాలలో అక్రమంగా రాయచూరుకు తరలించి అక్కడ మిల్లులో కిల్లోకు రూ.22 నుంచి 25 చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటూన్నారు. ఇంత జరుగుతున్న సంబంధిత రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులు రేషన్ దుకాణాలను తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నట్లు పలు అనుమానాలకు దారితీస్తోంది. రేషన్ దుకాణాల అక్రమాలపై ఫిర్యాదు చేస్తే తప్ప తనిఖీ చేసే పరిస్థితి ప్రస్తుతం జిల్లాలో నెలకొంది. రేషన్ డీలర్ల నుంచి ప్రతి నెల అధికారులకు మామూళ్లు ముడుతున్నట్లు ప్రధాన ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ప్రజా పంపిణీ వ్యవస్థ పై పర్యవేక్షణ కరువు..**

ప్రజా పంపిణీ వ్యవస్థ పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో డీలర్ల దందా అడ్డు లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ పక్కదారి పట్టకుండా ఎన్ని చర్యలు తీసుకుంటున్న క్షేత్రస్థాయిలో అధికారులు ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా రేషన్ డీలర్లు లబ్దిదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని క్వింటాళ్ల కొద్దీ దళారులకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్న రెవెన్యూ అధికారులు కానీ పౌరసరఫరా శాఖ అధికారులు కానీ ఏనాడు రేషన్ షాపులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. రేషన్ డీలర్లు బియ్యాన్ని పక్కదారి పట్టకుండా చూసేందుకు ప్రభుత్వం బయోమెట్రిక్ యంత్రాలు తీసుకువచ్చింది. అయినా కూడా వారి దందా మాత్రం ఆగడం లేదు. వేలిముద్రలు వేసి బియ్యం తీసుకోవాల్సిన లబ్దిదారులు అక్కడే



కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకున్న రేషన్ బియ్యం

డీలర్లకు విక్రయిస్తున్నారు. ప్రతినెల 5వ తేదీ నుండి 20వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉన్న కొంతమంది డీలర్లు వారం రోజులు మాత్రమే పంపిణీ చేస్తున్నారని లబ్ధిదారులు పేర్కొంటున్నారు. ప్రతి నెల రేషన్ షాపులకు వచ్చిన కోటా ఎంత? వినియోగదారులు తీసుకున్నవి ఎన్ని? రేషన్ దుకాణాలలో నిల్వ ఉన్న స్టాక్ ఎంత? అనే లెక్కలు తెలుస్తున్నాయి. కానీ పౌరసరఫరాల శాఖ అధికారులు ఏ మాత్రం షాపులను తనిఖీ చేయడం లేదంటూ ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ దుకాణాలలో లబ్దిదారులకు తూకం తక్కువ వస్తుందని ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రతి నెల లబ్దిదారులకు పంపిణీ చేసిన రేషన్ బియ్యం కోటా పోను మిగిలిన కోటాకు మించి షాపులోనే తక్కువ , ఎక్కువ ఉన్న అధికారులు తనిఖీలు చేసిన పాపానపోలేదు. రేషన్ దుకాణాల నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా రేషన్ డీలర్లే దళారులకు విక్రయిస్తున్నారు.. బియ్యం దందా చేసే వాళ్లు ఎక్కడెక్కడ ఉంటారో అధికారులకు తెలిసినప్పటికీ పెద్దగా పట్టించుకోవడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ బియ్యం దందాలో దళారులు, డీలర్లు లాభాలు గడిస్తున్నారు. అధికారులు తనిఖీలు చేయకపోవడం కారణంగానే రేషన్ బియ్యం పక్కదారి పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జిల్లాలో జరుగుతున్న ఈ అక్రమ దందాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఏ.స్వామి కుమార్ ను వివరణ కోరగా... అందుబాటులోకి రాలేదు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.